సాక్షి శ్రీకాకుళం

గురువారం । 28 । డిసెంబర్ । 2023



హోరాహోరీగా పాలిటెక్నిక్ పోటీలు

శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో క్రీడాపోటీలో ప్రారంభమయ్యాయి. 416 మంది క్రీడాకారుల హాజరయ్యారు. - 8లో



మర్చంట్ నేవీ ఉద్యోగి మృతి

జిల్లాకు చెందిన మర్చంట్ నేవీ ఉద్యోగి షిప్ ప్రమాదంలో మృతిచెందారు. స్వగ్రామం జెన్నాగాయిలో విషాదం నెలకొంది. - 8లో

ఆక్రమణలు తొలగించాల్సిందే

ఎల్.ఎన్.పేట: రైతుల సాగునీటి అవసరాలకు ఉపయోగించే చెరువుల్లో ఆక్రమణలు ఉంటే తొలగించాల్సిందేనని ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా స్పష్టం చేశారు. ఎల్.ఎన్.పేట మండలం పెద్దకోట రెవెన్యూ పరిధిలో బసవరాజుపేట బస్‌షెల్టర్ వెనుక వైపున ఉన్న అచ్చివాని చెరువును బుధవారం పరిశీలించారు. చెరువు విస్తీర్ణం, ఆయకట్టు, నీరు వచ్చే మార్గాలు, రైతుల సాగు నీటి అవసరాలు అడిగి తెలుసుకున్నారు. తహశీల్దారు ఆర్.అప్పలరాజు, వీఆర్వో పార్వతి, గ్రామ సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

తక్షణ ప్రవేశాలకు దరఖాస్తులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో మంగళ, బుధవారాల్లో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో తక్షణ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానించారు. ఎంబీఏలో 16 సీట్లు ఖాళీ ఉండగా తొమ్మిది మంది దరఖాస్తు చేసుకోగా అందరికీ ప్రవేశాలు కల్పించారు. ఎంసీఏలో ఆరు సీట్లు ఉండగా 25 మంది దరఖాస్తు చేస్తుకు న్నారు. దీంతో గురువారం ఐసెట్ -2023 ర్యాంకు, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా ప్రవేశాలు కల్పించనున్నారు. ఎంబీఏలో ఖాళీ సీట్ల భర్తీకి ఐసెట్ ర్యాంకు ఉన్న విద్యార్థులు గురువారం సైతం సంప్రదించవచ్చునని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య తెలిపారు.

జాతీయ స్విమ్మింగ్ పోటీల మేనేజర్‌గా జ్యోతిరాణి



జ్యోతిరాణిని అభినందిస్తున్న ఉర్లాం జెడ్పీహెచ్ స్కూల్ ఉపాధ్యాయులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆలిండియా స్కూల్ గేమ్స్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లాకు చెందిన ఫిజికల్ డైరెక్టర్ జి.ఎం.జ్యోతిరాణి మేనేజర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీ స్కూల్‌గేమ్స్ సెక్రటరీ భానుమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. న్యూఢిల్లీ వేదికగా జనవరి 2 నుంచి 9 వరకు జరిగే ఈ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ అండర్-17 ఎస్‌జీఎఫ్ బాలికల బృందానికి ఈమె మేనేజర్‌గా వ్యవహరించనున్నారు. ఉర్లాం జెడ్పీహెచ్ స్కూల్ పీఈటీగా పనిచేస్తున్న జ్యోతిరాణి గతంలోనూ అనేక రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు మేనేజర్‌గా, టెక్నికల్ అఫీషియల్స్‌గా వ్యవహరించారు. కొన్నేళ్లగా రాష్ట్ర, జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తూ పదుల సంఖ్యలో పతకాలు సాధించారు. తాజాగా మరోసారి జాతీయ పోటీలకు మేనేజర్‌గా నియామకం కావడం పట్ల డీఈఓ కె.వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం కె.హర్షవర్ధన్‌శర్మ, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ధర్మాన కృష్ణదాస్, ఎం.సాంబమూర్తి, పీఈటీ సంఘ నాయకులు ఎం.వి.రమణ, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బి.వి.రమణ, మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బొడ్డేపల్లి నారాయణరావు, కార్యదర్శి పాలకొండ అప్పారావు, చల్లా జగదీష్, భాగ్యలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు.

డిపార్ట్‌మెంటల్ పరీక్షలు ప్రారంభం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): డిపార్ట్‌మెంటల్ పరీక్షల/ ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు బుధవారం తెలిపారు. ఈ నెల 27 నుంచి జనవరి 3 వరకు ఉదయం, సాయంత్రం వేళల్లో రెండు కేంద్రాలలో ఏపీపీఎస్సీ నిర్వహించే కంప్యూటర్ ఆధారిత డిపార్ట్‌మెంట్ పరీక్షలు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. అభ్యర్థులు సమయపాలన పాటించాలన్నారు. డిపార్ట్‌మెంటల్ పరీక్షలు శివాని కాలేజీలో శుక్రవారం మాత్రమే జరుగుతాయని, వెంకటేశ్వర కాలేజీలో అన్ని రోజులు జరుగుతాయని తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో లెక్చరర్ల పోస్టులకు జనవరి 4న పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు.

నేటి నుంచి అంతర్ జిల్లాల టెన్నికాయిట్ పోటీలు



పోటీలకు సిద్ధమైన పాతపట్నం మినీ స్టేడియం

పాతపట్నం: అంతర్ జిల్లాల స్త్రీ, పురుషుల టెన్నికాయిట్ పోటీలు గురువారం నుంచి పాతపట్నం మినిస్టేడియం వేదికగా ప్రారంభం కానున్నాయని జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ అధ్యక్షుడు యెన్ని శేఖరబాబు, నిర్వాహకుడు గురాడి అప్పన్న తెలిపారు. పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు చెప్పారు. ఈ నెల 30 వరకు జరిగే ఈ పోటీలకు వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరవుతారని పేర్కొన్నారు. ఇప్పటికే కడప, కాకినాడ జిల్లాలకు చెందిన క్రీడాకారులు మైదానానికి చేరుకున్నారని తెలిపారు.



● ఆట అదిరింది

ఆడుదాం ఆంధ్రా పోటీలు జిల్లావ్యాప్తంగా ఉత్సాహభరిత వాతావరణంలో సాగుతున్నాయి. రెండో రోజు బుధవారం అన్ని నియోజకవర్గాల్లోనూ సచివాలయాల పరిధిలో ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరై పోటీలు ప్రారంభించారు. క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో పోటీలు హోరాహోరీగా సాగాయి. – సాక్షి నెట్‌వర్క్



ఎల్.ఎన్.పేట: ప్రభుత్వ జూనియర్ కాలేజీలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురంలో క్రికెట్ ఆడుతున్న ఎంపీపీ పుష్ప, పీఏసీఎస్ చైర్మన్ నరేంద్ర



టెక్కలి: ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా కబడ్డీ ఆడుతున్న యువకులు



రణస్థలం: పైడిభీమవరంలో టెన్నిస్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



ఇచ్ఛాపురం: వార్డు-1 సచివాలయం పరిధిలో కబడ్డీ పోటీలను పర్యవేక్షిస్తున్న కమిషనర్ ఎన్.రమేష్

ప్రమోదం మాటున ప్రమాదం



- పెరుగుతున్న పిక్నిక్ ప్రమాదాలు
- సముద్ర తీరాల్లో గల్లంతవుతున్న విద్యార్థులు
- శోకసంద్రంలో తల్లిదండ్రులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు

టెక్కలి: విహారయాత్రలు విషాదయాత్రలుగా మారుతున్నాయి. చిన్నచిన్న నిర్లక్ష్యాలు ప్రాణాలు బలిగొంటున్నాయి. పెద్దలు వారిస్తున్నా వినకుండా తమకేమీ కాదులే అన్న ధీమా తల్లిదండ్రులకు శోకాన్ని మిగుల్చుతోంది. ముఖ్యంగా సముద్ర తీర ప్రాంతాల్లో పిక్నిక్ జరుపుకునేందుకు వెళుతూ అక్కడ అలల తాకిడికి గురై ప్రమాదాల బారిన పడుతున్నారు. తాజాగా మందస సమీపంలో విద్యార్థులు సముద్ర తీరానికి వెళ్లి ప్రమాదానికి గురైన ఘటన తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. వారి ఆనందాన్ని కాదనలేక.. కాస్త స్వేచ్ఛను ఇస్తే.. చివరకు వారికి విషాదాన్ని మిగుల్చుతున్నారు. విహారాన్ని విషాదంగా మార్చకుండా, ఆనందాన్ని, ఆహ్లాదాన్ని పంచుకునేలా నిత్యం అప్రమత్తంగా ఉంటూ పిక్నిక్‌లు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

గుర్తించిన బీచ్‌లే మేలు..

జిల్లాలో సువిశాలంగా 186 కిలోమీటర్ల విస్తీర్ణంలో సముద్రతీర ప్రాంతం ఉంది. అనేక చోట్ల బీచ్‌లు ఉన్నాయి. ఏటా ఏదో ఒక బీచ్ వద్ద ప్రమాదాలు చోటుచేసుకుని యువకులు బలైపోతున్నారు. అటువంటి సంఘటనలు లేకుండా జాగ్రత్త చర్యలు పాటిస్తే ఎటువంటి ప్రమాదాలు లేకుండా తీర ప్రాంతంలో ఆహ్లాదం పొందవచ్చు. ముఖ్యంగా పర్యాటక శాఖ గుర్తించిన బీచ్‌లలో మాత్రమే పిక్నిక్‌లు ఏర్పాటు చేసుకోవడం సురక్షితం. జిల్లా పరిధిలో కళింగపట్నం, బారువ, శివసాగర్, భావనపాడు, గనగల్లవానిపేట, దిబ్బలపాడు, కుప్పిలి, డి.మత్స్యలేశం, మొగదాలపాడు, బాహుదాసాగర్, సంగాం, డొంకూరు, ఒంటూరు, కవిటి బీచ్, పితాలి బీచ్, లక్ష్మీపురం, మెట్టూరు, రాజారాంపురం, దేవునల్తాడ, వజ్రపుకొత్తూరు, ఇద్దివానిపాలెం బీచ్‌లు పర్యాటక శాఖాధికారులు గుర్తించారు.



భావనపాడు బీచ్‌లో పిక్నిక్ సందడి

అప్రమత్తతే శ్రీరామరక్ష

- తీర ప్రాంత పరిస్థితిని ముందుగానే అడిగి తెలుసుకోవాలి. స్థానికులతో మాట్లాడి నీటి లోతు, అలల ఉధృతిపై అవగాహన పెంచుకోవాలి.
- చిన్నాపెద్దా కలిసి సమూహంగా స్నానాలు చేస్తున్నప్పుడు తోటి వారిని ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి.
- పిల్లలను పెద్దలు, తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూ ఉండాలి.
- ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటూ ఆదమరిస్తే రాకాసి అలల తాకిడికి నీటిలో కొట్టుకుపోయే అవకాశం ఉంది.
- తీరంలో విహరించే సమయంలో పరిమితికి మించి బోటు ఎక్కకూడదు. లైఫ్ జాకెట్లను తప్పనిసరిగా ధరించాలి
- తగిన ఆహారం తీసుకోవాలి. లేదంటే స్నానం చేస్తే నీరసించి పడిపోయే ప్రమాదం ఉంది.
- మద్యం తాగి ఎట్టి పరిస్థితిలోనూ సముద్రంలోకి దిగకూడదు. ఉప్పు నీటి కారణంగా మత్తు ఎక్కువై శరీరం స్పృహ కోల్పోయే ప్రమాదం ఉంది.
- పోలీసులు ఏర్పాటు చేసిన హెచ్చరికల బోర్డులలోని నిబంధనలు కచ్చితంగా పాటించాలి.
- అల్పపీడనం ప్రభావం ఉంటే ఆయా రోజుల్లో సముద్ర తీరానికి వెళ్లకపోవడం మంచిది. ముఖ్యంగా మిగిలిన రోజుల కంటే అమావాస్య రోజుల్లో అలల ఉధృతి అధికంగా ఉంటుంది.

జాగ్రత్తలు పాటించాలి..

పిక్నిక్‌ల సీజన్‌లో సముద్ర తీర ప్రాంతాల్లో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా మెరైన్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం. నిత్యం సముద్ర తీరంలో ప్రత్యేక పర్యవేక్షణ చేసేలా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి. బీచ్‌ల వద్ద పిక్నిక్ చేసుకునే యువత ఎటువంటి ప్రమాదాలకు గురి కాకుండా జాగ్రత్తలు పాటించాలి.

– కాళిదాసు, డీఎస్పీ, మెరైన్

గస్తీ ముమ్మరం..

బీచ్‌లలో పిక్నిక్ కోసం అత్యధికంగా పర్యాటకులు వచ్చే అవకాశం ఉంది. సముద్ర తీరంలో మునిగిపోకుండా గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతాం. స్థానికంగా ఉన్న పోలీసులతో సమన్వయంగా సముద్ర తీరంలో ప్రమాదాలను నివారించే చర్యలు చేపడతాం. పర్యాటకులు సముద్రం లోపలకు వెళ్లకుండా గస్తీలు ముమ్మరం చేస్తున్నాం. నిషేధిత బీచ్‌ల వైపు పిక్నిక్‌లకు వెళ్లకపోవడం శ్రేయస్కరం.

– డి.రాము, సీఐ, మెరైన్



యువతను అప్రమత్తం చేస్తున్న మెరైన్ సీఐ రాము, సిబ్బంది

- కోతకు గురైన తీర ప్రాంతానికి వెళ్లొద్దు.
- జన సంచారం లేని తీరానికి వెళ్తే కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువ.

గల్లంతైన విద్యార్థి మృతి



జయరాం మృతదేహం వద్ద రోదిస్తున్న తండ్రి హరికృష్ణ

మందస: ఉద్దాన ప్రాంతమైన మందస మండలం భేతాళపురం పంచాయతీ రట్టి తీరంలో సిగలపుట్టుగ బీచ్‌లో మంగళవారం గల్లంతైన విద్యార్థి మృతి చెందాడు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీలోని బెల్లుపడలో ట్యూషన్ సెంటర్ నిర్వహిస్తున్న విద్యార్థులను నిర్వాహకులు సిగలపుట్టుగ బీచ్‌కు పిక్నిక్‌కు తీసుకువచ్చారు. వీరిలో కొందరు సముద్రంలో ఈత కొడుతుండగా భారీ అల తాకిడి సముద్రంలోకి కొట్టుకుపోయారు. అప్రమత్తమైన మత్స్యకారులు విద్యార్థులను రక్షించారు. చందు, మేఘన తీవ్ర అస్వస్థతకు గురికాగా, 9వ తరగతి చదువుతున్న ఆసి జయరాం(15) గల్లంతయ్యాడు. తీరంలోని మత్స్యకారులు, మెరైన్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. విద్యార్థి గల్లంతైన ప్రదేశం నుంచి కిలోమీటరు దూరంలో మందస-సోంపేట సరిహద్దులోని ఎర్రముక్కాం ప్రాంతానికి జయరాం మృతదేహం బుధవారం కొట్టుకువచ్చింది. కుమారుడి మృతితో తల్లిదండ్రులు హరికృష్ణ, నాగమ్మ కన్నీరుమున్నీరుగా విలపించారు. ఇద్దరు కుమార్తెల అనంతరం జన్మించిన జయరాంను అల్లారు ముద్దుగా పెంచుకున్నారు. ఇంతలో మృత్యువు వెంటాడటంతో విషాదంలో మునిగిపోయారు. బారువ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఇచ్ఛాపురం నుంచి వచ్చిన విద్యార్థి తల్లిదండ్రులతో పాటు బంధువులు మృతదేహాన్ని తీసుకెళ్లారు.

చెరువుల్లో మాదిరిగా సముద్రంలో ఈత కొట్టలేమని విషయాన్ని గ్రహించాలి.

- సుదూర ప్రాంతాల నుంచి వారిని లోతుకు వెళ్లకుండా పోలీస్ సిబ్బందిని అప్రమత్తం చేయాలి.
- బీచ్ ప్రాంతంలో మద్యం దుకాణాలు, బెల్టు దుకాణాలు లేకుండా చూడాలి. పర్యాటకులు సైతం మద్యం సేవించడంపై నిషేధం ఉండాలి.
- లోతైన ఇతర ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలి.
- బీచ్‌లో సందర్శకుల తాకిడి అధికంగా ఉన్నప్పుడు స్థానిక పోలీసులతో పాటు మెరైన్ పోలీసులు అందుబాటులో ఉండాలి. బీచ్‌లో ఎంత దూరం వరకు శ్రేయస్కరమో అధికారులు, పోలీస్ సిబ్బంది తగిన హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి సందర్శకులను అప్రమత్తం చేయాలి.

పండగలా 'ఆడుదాం ఆంధ్రా'

- 1 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష రెండో దశకు శ్రీకారం
- టెలి కాన్ఫరెన్సులో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం- ఆంధ్ర కార్యక్రమాన్ని అన్ని చోట్లా పండగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, వైద్య ఆరోగ్య అధికారులు, ఇతర ఉన్నతాధికారులతో ఆడుదాం ఆంధ్ర, జగనన్న ఆరోగ్య సురక్ష రెండో దశ కార్యక్రమాలపై టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జిల్లాలోని 364 సచివాలయాల పరిధిలో క్రీడలు మొదలు కావాలని, మొత్తం 1243 మ్యాచ్‌లను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని చోట్లా ప్రేక్షకుల హాజరు కూడా నమోదు చేయాలని, మ్యాచ్ ఆరంభానికి ముందు, ఫలితం తేలిన తర్వాత తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. క్రీడల నిర్వహణకు నిధుల కొరత లేదని, అన్ని సచివాలయాలకు నిధులు జమ చేశామని చెప్పారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ క్రీడాకారులకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని, వాటి ఫోటోలను కూడా ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని సూచించారు.

రెండో దశ క్యాంపులకు సిద్ధం..

జగనన్న ఆరోగ్య సురక్ష రెండో దశపై కలెక్టర్ మాట్లాడుతూ 2024 జనవరి 1 నుంచి ప్రారంభం కానున్న ఈ కార్యక్రమంలో స్పెషలిస్ట్ డాక్టర్ల భాగస్వామ్యంతో సచివాలయాల వారీగా ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలన్నారు. శిబిరం పేరు, వైద్యుల పేర్లతో జియో ట్యాగింగ్ చేయాలని స్పష్టం చేశారు. ఆరోగ్యశ్రీ రిఫరల్ సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో ఆర్.వెంకట్రామన్, డీఎస్‌డీఓ కే.శ్రీధర్, సెట్‌శ్రీ సీఈవో ప్రసాదరావు, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు, డీఈఓ వెంకటేశ్వరరావు, డీఎంహెచ్ఓ బి.మీనాక్షి, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ ప్రకాశరావు పాల్గొన్నారు.

శ్రీముఖలింగేశ్వరుని హుండీ ఆదాయం లెక్కింపు రేపు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం హుండీ కానుకల ఆదాయం ఈ నెల 29న లెక్కించనున్నామని ఈఓ పి.ప్రభాకరరావు బుధవారం తెలిపారు. కార్తీక మాసం అనంతరం జరగనున్న ఈ లెక్కింపులో ఆసక్తి గల భక్తులు పాల్గొనవచ్చని కోరారు.

జనవరి 22న తుది ఓటర్ల జాబితా



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ గణపతిరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వచ్చే సార్వత్రిక ఎన్నికల కోసం పూర్తి స్థాయి ఓటర్ల తుది జాబితాను జనవరి 5 కాకుండా అదే నెల 22న విడుదల చేస్తామని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు వెల్లడించారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం శ్రీకాకుళం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఓటరు నమోదుకు అక్టోబర్ 28 నుంచి డిసెంబర్ 9 మధ్య జిల్లాలో 49,649 మంది దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించని కారణంగా వాటిలో 2,492 దరఖాస్తులను తిరస్కరించినట్లు చెప్పారు. వివిధ కారణాలు చూపుతూ 51,270 ఓట్ల తొలగింపు కోసం దరఖాస్తులు వస్తే వాటిని పరిశీలించి 47,327 ఓట్లను తొలగించామన్నారు. వాటిలో మరణించినవారి పేర్లతో 14,982 ఓట్లు ఉన్నాయని, రెండు ఓట్లు కలిగిన 10,040 మంది ఓట్లు ఉన్నాయని వివరించారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, ఇతర సవరణలకు వచ్చిన క్లెయిముల పరిశీలన తుది దశకు చేరిందన్నారు. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు వచ్చే నెల 12 నాటికి వాటిని పరిష్కరిస్తామన్నారు. ఇంకా అర్హత ఉన్న వారు ఓటు హక్కు పొందేందుకు ఫారం-6ను నేరుగా గానీ, ఆన్‌లైన్‌లో గానీ అందించవచ్చని, ఈ ప్రక్రియ నిరంతరం సాగుతుందని స్పష్టం చేశారు.

వాటిని పరిశీలించి, సాధారణ ఎన్నికల నామినేషన్లకు పది రోజుల ముందు ప్రచురించే అనుబంధ (సప్లిమెంట్) జాబితాలో చేర్చుతామని వివరించారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం చెప్పారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రొౌతు శంకరరావు, పి.ఎం.జె.బాబు(టీడీపీ), గోవింద మల్లిబాబు(కాంగ్రెస్), కేశవరావు(బీఎస్పీ), సి-సెక్షన్ సూపరింటెండెంట్ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

పోర్టు పనులు వేగవంతం

టెక్కలి: పోర్టు పనులను వేగవంతం చేయాలని మారీటైం బోర్డు సీఈఓ ప్రవీణ్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. సంతబొమ్మాళి మండలం మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు పనులను బుధవారం పరిశీలించారు. పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనుల విషయంలో సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ ఖమర్, ఏపీఐఐసీ అధికారులు మురళి, బి.హరిబాబు, పాండురంగం తదితరులు పాల్గొన్నారు.



పనుల పురోగతి తెలుసుకుంటున్న మారీటైం బోర్డు సీఈఓ ప్రవీణ్‌కుమార్

అన్నీ రిఫర్ చేస్తే మీరెందుకు?

- ఇష్టారాజ్యంగా సెలవులు ఎవరిచ్చారు?
- పలాస సీహెచ్‌సీ వైద్యసిబ్బందిపై మంత్రి సీదిరి అప్పలరాజు ఆగ్రహం

కాశీబుగ్గ : 'నాడు-నేడుతో రూ.5 కోట్లు ఖర్చు చేసి ఆస్పత్రిని అభివృద్ధి చేస్తే పేద ప్రజలకు కనీస వైద్యం అందించకపోతే ఎలా? సుమారు 50 మంది వైద్య సిబ్బంది ఉన్న ఈ ఆస్పత్రిలో 17 మందే కనిపిస్తున్నారు. మిగతావారికి ఇష్టారాజ్యంగా ఎవరు సెలవులు ఇచ్చారు. ఇంత పెద్ద ఆస్పత్రిలో 12 మంది రోగులు మాత్రమే ఉన్నారా? ఇదేనా మీ పనితీరు..' అంటూ రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు వైద్యసిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిని బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. కొందరు వైద్యులు విధులకు హాజరైనా కుర్చీల్లో లేకపోవడం, మరికొందరు సెలవులో ఉన్నా విధుల్లో ఉన్నట్లు సంతకాలు చేసి ఉండటం గమనించి మండిపడ్డారు. నిండు గర్భిణులను వేరే ఆస్పత్రులకు రిఫర్ చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. పలాస ఆస్పత్రి పనితీరుపై రోజూ వార్తలు వస్తున్నా వైద్యులు, సిబ్బంది తీరు మారకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. పని చేయడం ఇష్టం లేని వారు వెళ్లిపోవచ్చని, వైద్యసేవలు అందించడంలో అలసత్వం వహిస్తే మాత్రం సహించేది లేదని హెచ్చరించారు. ఇటీవల పలాస ప్రభుత్వ ఆసుపత్రి నుంచి గర్భిణిని 108 వాహనంలో టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడంతో ఆమె మార్గమధ్యలోనే ప్రసవించిన విషయాన్ని ఉన్నత స్థాయి అధికారులకు మంత్రి ఫోన్‌లో తెలియజేశారు. ఇంతలో వజ్రపుకొత్తూరు మండలం అనంతగిరి పంచాయతీకి చెందిన మెట్టూరు లక్ష్మి అనే గర్భిణిని పురిటినొప్పులతో ఆస్పత్రికి తీసుకొచ్చారు. వైద్యులు లేకపోవడంతో టెక్కలి జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడ కూడా మత్తు వైద్యులు లేకపోవడంతో తిరిగి పలాసలోనే ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకొచ్చి ప్రసవం చేయించారు.



పలాస సీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

క్లుప్తంగా

వై.వి.సూర్యనారాయణ మృతి తీరని లోటు



సూర్యనారాయణ అంతిమయాత్రలో పాల్గొన్న గ్రామస్తులు

శ్రీకాకుళం రూరల్: జెడ్పీ మాజీ చైర్మన్ వై.వి. సూర్యనారాయణ మృతి చెందడం బాధాకరమని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. సూర్యనారాయణ భౌతికకాయాన్ని బుధవారం అరసవల్లిలోని స్వగృహంలో సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావంలోనే జిల్లా నుంచి చేరిన మొట్టమొదటి నాయకుడు వై.వి.సూర్యనారాయణ అని కొనియాడారు. ఇలాంటి నేతను కోల్పోవడం పార్టీకి తీరని లోటు అని పేర్కొన్నారు. పరామర్శించిన వారిలో శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, మాజీ ఎంపీ కిల్లి కృపారాణి, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, టీడీపీ నాయకులు గుండ లక్ష్మీదేవి, బగ్గు రమణమూర్తి, చౌదరి బాబ్జీ తదితరులు ఉన్నారు.

శ్రీముఖలింగంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో విష్ణుమూర్తి

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలసిన మధుకేశ్వరుని క్షేత్రపాలకుడైన విష్ణుమూర్తికి ధన్మురాసం బుధవారం సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. స్వామివారికి తులసీ దళాలతో అర్చనలు చేశారు. అనంతరం మంగళహారతులిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తెల్లదొరల పాలిట సింహస్వప్నం పుల్లెల



పుల్లెల శ్యామసుందరరావు చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ప్రజాప్రతినిధులు

ఇచ్ఛాపురం రూరల్: స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో తెల్లదొరల పాలిట సింహస్వప్నంగా పుల్లెల శ్యామసుందరరావు నిలిచారని ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అన్నారు. రైతు బాంధవుడు శ్యామసుందరరావు 121వ జయంతి సందర్భంగా బుధవారం పీఏసీఎస్ కార్యాలయం ఆవరణంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ బోర పుష్ప, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ పాతిర్ల రాజశేఖరరెడ్డి, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, సర్పంచ్‌లు నీలాపు సారధిరెడ్డి, తడక జోగారావు, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, జేసీఎస్ కన్వీనర్ సాలిన ఢిల్లీ, జోగల దిలీప్ యాదవ్ పాల్గొన్నారు.

త్వరితగతిన ఎంపీ ల్యాడ్స్ పనులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, తదితరులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లాలో ఎంపీ ల్యాడ్స్ నిధులతో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడుతో కలిసి 17వ లోక్ సభ పార్లమెంట్ సభ్యుల స్థానిక ప్రాంత అభివృద్ధి పథకం కింద నిధుల వినియోగం, పూర్తయిన పనులు, యూసీల సమర్పణ తదితర అంశాలపై అధికారులతో బుధవారం సమీక్షించారు. ఎంపీ ల్యాడ్స్ నిధుల వినియోగంలో రాష్ట్రస్థాయిలో శ్రీకాకుళం పార్లమెంట్ తొలి స్థానంలో నిలిచిందని కలెక్టర్ పేర్కొన్నారు. మంజూరైన మిగతా పనులు కూడా నెలలోగా పూర్తి చేసి యూసీలు సమర్పించాలని సూచించారు. ఎంపీ మాట్లాడుతూ 17వ లోక్‌సభకు సంబంధించి రూ.23.24 కోట్లతో 455 పనులు మంజూరు చేశామన్నారు. సమావేశంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ప్రసన్నలక్ష్మి, నెడ్‌క్యాప్ జిల్లా మేనేజర్ సుబ్రహ్మణ్యం, పలువురు ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

హోరాహోరీగా పాలిటెక్నిక్ క్రీడాపోటీలు

- 10 కళాశాలల నుంచి 416 మంది క్రీడాకారుల హాజరు
- క్రీడలు జీవితంలో భాగం కావాలి : ఆర్జేడీ



పాల్గొన్న క్రీడాకారులు



క్రీడా జ్యోతి వెలిగిస్తున్న సాంకేతిక విద్యాశాఖ ఆర్జేడీ సత్యనారాయణమూర్తి



ఎన్‌సీసీ విద్యార్థుల పిరమిడ్ ప్రదర్శన

ఎచ్చెర్ల క్యాంపస్ : క్రీడలను జీవితంలో భాగంగా చేసుకోవాలని సాంకేతిక విద్యాశాఖ ఆర్జేడీ జె.సత్యనారాయణమూర్తి అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంకేతిక విద్యా శాఖ శ్రీకాకుళం ప్రాంతీయ స్థాయి 26వ పాలిటెక్నిక్ క్రీడలు, ఆటలు - 2023 పోటీలను ఆయన ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించి అతిథులకు గౌరవ వందనం చేశారు. అనంతరం ఎన్‌సీసీ విద్యార్థులు నిర్వహించిన పిరమిడ్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. జాతీయ, క్రీడా, కళాశాల పతకాలను అతిథులు ఆవిష్కరించి క్రీడాజ్యోతి వెలిగించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ జిల్లా కన్వీనర్ పాయింట్ నుంచి 10 కళాశాలలకు చెందిన 416 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నారని చెప్పారు. విద్య, ప్లేస్‌మెంట్, క్రీడలకు సాంకేతిక విద్యాశాఖ ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. సాంకేతిక విద్యాశాఖ రాష్ట్ర డైరెక్టర్ చదలవాడ నాగరాణి శ్రీకాకుళం ప్రభుత్వ కళాశాల ప్రగతికి రూ. 1.25 కోట్లు మంజూరు చేశారని వెల్లడించారు. విద్యార్థులు గెలుపు, ఓటములు సమానంగా స్వీకరించాలని, ఓటమి నుంచి గెలుపు మార్గాలను అన్వేషించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సాంకేతిక విద్యాశాఖ పీడీ ఎంఏవీ రామకృష్ణ, పాలిటెక్నిక్ గౌరవ పీడీల అధ్యక్షుడు బి.రఘునాథ రెడ్డి, ప్రిన్సిపాల్ బి.జానకిరామయ్య, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.దామోదర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా..

మొద టిరోజు జరిగిన పోటీల్లో టేబుల్ టెన్నిస్ బాలికల విభాగంలో కె.హర్షిత (జిపిడబ్ల్యూ, శ్రీకాకుళం), డబుల్స్‌లో కె.హర్షిత, జి.పూజిత (జీపీడబ్ల్యూ, శ్రీకాకుళం) మొదటి స్థానం సాధించారు. బాలుర విభాగం సింగిల్స్‌లో పి.శ్రీధర్ (పీజీటీ శ్రీకాకుళం), డబుల్స్‌లో ఎం.రాఘవేంద్రరావు, కె.కుమారస్వామి (వెంకటేశ్వర పాలిటెక్నిక్) మొదటి స్థానం సాధించారు. చెస్ బాలురులో కె.ప్రతాప్ (జీపీటీ, ఆమదాలవలస), కె.గిరిధర్ సాయికిరణ్(నారాయణ పాలిటెక్నిక్) మొదటి రెండుస్థానాల్లో నిలిచారు. బాలికల్లో బి.రమ్యశ్రీ (జీపీడబ్ల్యూ, శ్రీకాకుళం) ఎస్.లక్ష్మి (వెంకటేశ్వర పాలిటెక్నిక్) మొదటి రెండు స్థానాలు సాధించారు.

అచ్చెన్నా.. బహిరంగ చర్చకు సిద్ధమా?



పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న పేరాడ తిలక్

నందిగాం: టెక్కలి నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, జగనన్న హయాంలో జరుగుతున్న అభివృద్ధిపై బహిరంగంగా చర్చించడానికి టీడీపీ ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు సిద్ధమా అని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ సవాల్ విసిరారు. బుధవారం నందిగాంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అచ్చెన్నాయుడు, అతని సోదరుడు దివంగత ఎర్రన్నాయుడు, ఎంపీ రామ్మోహననాయుడు జగనన్న కుటుంబంపై అనవసర ఆరోపణలు చేయడం తప్ప ఈ ప్రాంత అభివృద్ధికి ఏనాడూ ప్రయత్నించలేదని మండిపడ్డారు. గతంలో అచ్చెన్నాయుడు మంత్రిగా ఉన్నప్పుడు, ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు గానీ నందిగాం మండలానికి చేసిందేమీ లేకపోయినా ప్రజల వద్ద గొప్పలు పలుకుతున్నారని దుయ్యబట్టారు. 40 ఏళ్లుగా మీ కుటుంబానికి ఓట్లు వేస్తున్న ఈ ప్రాంత ప్రజలకు మేలు చేకూరేలా ఒక్క శాశ్వతమైన పనైనా చేశారా అని ప్రశ్నించారు. నేడు శ్రీకాకుళం జిల్లా అభివృద్ధి చెందిందన్నా, రాష్ట్రం టెక్కలి వైపు చూస్తోందన్నా అది ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వల్లే సాధ్యపడిందని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వం వచ్చాక టెక్కలి నియోజకవర్గానికి రూ.10వేల కోట్లు కేటాయించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. టెక్కలిలో ప్రతిపక్ష ఎమ్మెల్యే గెలిచినప్పటికీ ఎలాంటి కక్ష సాధింపు చర్యలు లేకుండా నిధులు కేటాయిస్తున్న ముఖ్యమంత్రిపై లేనిపోని ఆరోపణలు చేస్తే ప్రజలు తిరగబడతారని గుర్తుపెట్టుకోవాలన్నారు. గతంలో అచ్చెన్నాయుడు మంత్రిగా ఉన్నప్పుడు టెక్కలి నియోజకవర్గంలో ప్రతిపక్ష సర్పంచ్‌ల చెక్‌పవర్ రద్దు, క్షేత్రసహాయకులను తొలగించడం, ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేయడం, దూరప్రాంతాలకు బదిలీ చేయించడం వంటివి చేశారని గుర్తు చేశారు.

నేడు ఎస్ఆర్ షాపింగ్‌మాల్ నూతన షోరూం ప్రారంభం



మాట్లాడుతున్న ఎస్ఆర్ షాపింగ్‌మాల్ ప్రతినిధులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం ప్రజల అభిరుచులకు అనుగుణంగా తక్కువ ధరలకే రకరకాల వస్త్రాలను ఎస్ఆర్ షాపింగ్ మాల్ ద్వారా అందించనున్నామని షాపింగ్‌మాల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఎల్.ఎన్.ప్రసాద్‌రెడ్డి తెలిపారు. సరికొత్త హంగులతో శ్రీకాకుళం నగరంలోని జీటీ రోడ్డులో ఎస్ఆర్‌షాపింగ్ మాల్ రెండో బ్రాంచి గురువారం ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రయివేటు హోటల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలో పేరుపొందిన తయారీదారుల నుంచి నాణ్యమైన వస్త్రాలను తీసుకొచ్చి శ్రీకాకుళం జిల్లా ప్రజలకు అందించనున్నామని చెప్పారు. కుటుంబంలో అందరికీ అన్ని రకాల వస్త్రాలు అందించేందుకు నూతన బ్రాంచిని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, ఎంపీ కింజరాపు రామ్మోహన్‌రావుతో పాటు సీఎంఆర్ మేనేజింగ్ డైరెక్టర్ మావూరి వెంకటరమణ, ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు, గుండ లక్ష్మీదేవి తదిరులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ హాజరై ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు వి.పూజారి, ఏ.కేశవరెడ్డి, ఏరియా మేనేజర్ వెంకటేశ్వరరెడ్డి, బ్రాంచి మేనేజర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అరేబియా సముద్రంలో మునిగిన షిప్

- మర్చెంట్ నేవీ ఉద్యోగి మృతి
- జెన్నాగాయి గ్రామంలో విషాద ఛాయలు



ఉమ్మిడి సింహాచలం(ఫైల్)

కంచిలి: మండలంలోని బొగాబెణి పంచాయతీ జెన్నాగాయి గ్రామానికి చెందిన ఉమ్మిడి సింహాచలం(21) ఇరాన్‌లో అరేబియా సముద్రంలో షిప్ మునిగిన ఘటనలో మృతి చెందినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సింహాచలం ఇంటర్మీడియట్ వరకు చదివాడు. నెలరోజుల క్రితం మధ్యప్రదేశ్‌కు చెందిన రుద్రాక్ష ప్రొఫెషనల్ కన్సల్టెన్సీ ద్వారా మర్చెంట్ నేవీలో చేరాడు. తనతో పాటు మరికొంతమంది సహచరులతో కలిసి విధుల్లో ఉండగా షిప్ మునిగిపోయింది. మూడు రోజుల క్రితం షిప్ మునిగిందన్న విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు ఆందోళన చెందారు. ఈ విషయమై స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డిని సంప్రదించగా ఆయన కన్సల్టెన్సీ ప్రతినిధులతో ఫోన్‌లో మాట్లాడారు. సింహాచలంతో పాటు మరో ఇద్దరు ఉద్యోగులు షిప్ ప్రమాదంలో మృతిచెందారని, రెండు మృతదేహాలు ఇప్పటి వరకు లభ్యమయ్యాయని, మరో మృతదేహం దొరకాల్సి ఉందని చెప్పారు. సింహాచలం మృతదేహాన్ని భారత్ తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటికే ఇండియన్ ఎంబసీతో సంప్రదించామని కన్సల్టెన్సీ ప్రతినిధులు పేర్కొన్నారు. కాగా, సింహాచలంకు తల్లిదండ్రులు రామయ్య, ఊర్మిళ, ఇద్దరు అక్కలు ఉన్నారు. ఒక సోదరికి వివాహం కావాల్సి ఉంది. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు.

వెంటాడిన మృత్యువు

- గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు దుర్మరణం
- చల్లవానిపేట జంక్షన్‌లో విషాదం



ఘటనా స్థలంలో మృతదేహాలు



ధర్మారావు(ఫైల్)



కన్నాంబ(ఫైల్)

జలుమూరు: మండల కేంద్రం జలుమూరు సమీపంలో నామాలపేట వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. మృతులు లింగాలవలస పంచాయతీ చల్లవానిపేట జంక్షన్‌కు చెందిన కొర్ను కన్నాంబ(55), చింతాడ ధర్మారావు(42)గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టి.లింగాలుపాడులోని సంతలుబైలుకు చెందిన ధర్మారావు కొన్నాళ్లుగా చల్లవానిపేట జంక్షన్‌లో భవన నిర్మాణ సామగ్రి వ్యాపారం చేస్తున్నారు. ఇదే ప్రాంతానికి చెందిన కన్నాంబతో కలిసి బుధవారం సరుబుజ్జిలి మండలం యరగాంలో బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్లారు. తిరిగి వస్తున్న క్రమంలో నామాలపేట వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కన్నాంబకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ధర్మారావుకు భార్య, కుమారుడు ఉన్నారు. ఎస్‌ఐ పి.పారినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విజయ గణపతికి దీపారాధన



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో ఉన్న విజయగణపతి దేవాలయంలో స్వామికి అష్టోత్తర శత దీపారాధనలు బుధవారం జరిగాయి. అర్చకులు స్వామివారికి అష్టోత్తర శత దీపారాధనలు వెలిగించారు. భక్తులు అధికంగా స్వామివారిని దర్శించుకున్నారు.

భర్త మృతదేహానికి భార్య తలకొరివి

సారవకోట: మండలంలోని అలుదు గ్రామానికి చెందిన పొన్నాడ అప్పారావు(63) బుధవారం మృతి చెందడంతో ఆయన మృతదేహానికి భార్య తలకొరివి పెట్టింది. అనారోగ్యంతో భర్త చని పోవడంతో తలకొరివి పెట్టేందుకు వేరెవ్వరూ లేకపోవడంతో సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు పూర్తి చేశారు.



పట్టపగలే దోపిడీ

గార: మేజర్ పంచాయతీ శ్రీకూర్మంలోని దువ్వుపేటలో పట్టపగలే ఇంట్లోకి దొంగలు చొరబడి బంగారం, నగదు దోచుకెళ్లారు. దువ్వు లక్ష్మీ బుధవారం ఉదయం పొలంపనులకు వెళ్లి ఇంటికి తిరిగి ఉదయం 11 గంటలకు వచ్చేసరికి తలుపులు తెరచి ఉన్నాయి. లోపలకు వెళ్లి చూడగా బీరువాలో ఉన్న 3.5 తులాల బంగారం, 32 తులాల వెండి, రూ.16 వేలు నగదు కనిపించలేదు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా, సీఐ కామేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు





గాయపడిన వంజరాపు రాము , కార్తీక్

నరసన్నపేట: స్థానిక మెయిన్ రోడ్డుపై ఎస్ఆర్ షాపింగ్ మాల్ ఎదురుగా బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఈ ఘటనలో గాయపడిన ఇద్దరు వ్యక్తులు పక్కనే ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొనడంతో ప్రమాద తీవ్రత పెరిగింది. మడపాంకు చెందిన వంజరాపు రాము(రాజు) నరసన్నపేట బండివీధిలో అద్దె ఇంట్లో ఉంటున్న తన మేనళ్లుడు కార్తీక్‌ను వెంట పెట్టుకొని మెయిన్ రోడ్డుపైకి ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. తీవ్రంగా గాయపడిన రాముకు నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. కార్తీక్ నరసన్నపేటలోని ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. నరసన్నపేట పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కుటుంబ సభ్యుల నుంచి వివరాలు తీసుకొని కేసు నమోదు చేస్తామని ఏఎస్‌ఐ ఆసిరినాయుడు తెలిపారు. కాగా ప్రమాదానికి కారణమైన మరో ద్విచక్ర వాహనం ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

రైలు ఢీకొని యువకుడు మృతి



గుర్తుతెలియని యువకుడి మృతదేహం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం, జాడుపూడి రైలు నిలయం మధ్య రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడు మృతి చెందినట్లు జీఆర్‌పీ పోలీసులు తెలిపారు. ఆఫ్‌లైన్ ట్రాక్‌లో గుర్తు తెలియని రైలు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని చెప్పారు. మృతుడి వయసు 25 నుంచి 30 ఏళ్ల ఉంటుందని పేర్కొన్నారు. నీలం జర్కిన్, టీషర్ట్, రన్నింగ్ ట్రాక్ ఫ్యాంట్ ధరించాడని, ఎడమ మోచేతిపై దొళాయి అని ఒరియాలో రాసి ఉందని తెలిపారు. ఒడిశా సమీప గ్రామాలకు చెందిన వాడిగా అనుమానిస్తున్నారు. జీఆర్‌పీ హెచ్‌సీ కోదండరావు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆర్టీసీ కాంప్లెక్సులో గుర్తు తెలియని మృతదేహం

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్సులో బుధవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ నాగిరెడ్డి లక్ష్మణరావు పేర్కొన్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని అంబులెన్సులో రిమ్స్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నువ్వు సాగు.. లాభాలు బాగు



నువ్వుల సాగు (ఫైల్) (ఇన్‌సెట్లో) ఎస్.కిరణ్‌కుమార్, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త

ఆమదాలవలస రూరల్: స్వల్ప వ్యవధితో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధించే పంటల్లో నువ్వుసాగు ఒకటి. ప్రాచీనకాలం నుంచి సాగు చేస్తున్న ఈ పంటలో నూనె శాతం 45-55, ప్రొటీన్ శాతం 25 వరకు ఉంటూ సెసమోలిన్, యాంటీ ఆక్సిడెంట్స్ ఉండటం వల్ల ఎక్కువ కాలం నిల్వ ఉంటూ మనకు వ్యాధి నిరోధక శక్తి కలిగిస్తుంది. విటమిన్- ఈ ఎక్కువగా ఉండటం వల్ల చర్మానికి చాలా మంచిది. జిల్లాలో నువ్వుల పంట విస్తారంగా సాగవుతోంది. తక్కువ సమయంలో తక్కువ వనరులతో అధిక లాభాలు వస్తుండటంతో సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఖరీఫ్ వర్షాధారంగా పండించే దానికంటే రబీ, వేసవిలో నువ్వుల పంటలను సాగు చేస్తే చీడపీడల నివారణతో పాటు విత్తన నాణ్యత పెరిగి అధిక దిగుబడులు సాధించవచ్చు. నువ్వుల పంట సాగు- చీడపీడల నివారణపై ఆమదాలవలస (శ్రీకాకుళం జిల్లా) కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.కిరణ్‌కుమార్ రైతులకు పలు సలహాలు, సూచనలు అందిస్తున్నారు.

ఉష్ణోగ్రతలు కీలకం..

నువ్వు పంట ఎదుగుదలకు ఉష్ణోగ్రతలు కీలకం. 25-37 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటే పంట ఎదుగుదలకు మంచిది. విత్తనం మొలకెత్తడానికి ఈ ఉష్ణోగ్రత చాలా అవసరం. విత్తిన తరువాత 20 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటే మొలకెత్తడానికి ఆలస్యం జరుగుతుంది. రాత్రి ఉష్ణోగ్రతలు తక్కువగా ఉన్న ప్రదేశాల్లో నువ్వు విత్తనాలు చల్లకూడదు. మొలక దశలో మంచు కురవకూడదు. మంచు కురవడం వల్ల మొక్కల సాంద్రత తగ్గిపోతుంది. డిసెంబర్ 15 నుంచి జనవరి 31 వరకు విత్తనాలు జల్లుకోవచ్చు. నేలను 2-4 సార్లు మొత్తగా దున్ని, చదును చేయాలి. ఎకరాకు 2.4 కిలోల విత్తనం సరిపోతుంది. విత్తనానికి సమపాళ్లలో ఇసుక, నూకలు కలిసి విత్తుకోవాలి. కిలో విత్తనానికి 3 గ్రాముల థైరం గానీ, కాప్టాన్ గానీ మాంకోజెబ్‌తో విత్తన శుద్ధి చేస్తే 21 రోజుల వరకు తెగుళ్లను నివారించవచ్చు. వరుసల మధ్య 30 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 15 సెంటీమీటర్లు ఉండాలి. నువ్వులను రబీలో డిశంబర్ 15 నుంచి జనవరి 15 వరకు, వేసవిలో జనవరి 2, 3 వారాల్లో విత్తుకోవచ్చు. గౌరి, మాధవి, ఎలమంచిలి-11, 17, 66 రకాలు అనుకూలం. జిల్లాలో 5500 హెక్టార్లులో నువ్వు సాగు చేసేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు.

ఎరువులు, యాజమాన్య పద్ధతులు..

ఖరీఫ్‌లో ఆఖరి దుక్కిలో ఎకరాకు 4 టన్నుల పశువుల ఎరువు, 16 కిలోల నత్రజని, 8 కిలోల పొటాష్, 8 కిలోల భాస్వరాన్ని ఎరువులుగా వేసుకోవాలి. నత్రజని సగభాగం , మొత్తం భాస్వరం, పొటాష్ ఇచ్చే ఎరువులను ఆకరి దుక్కిలో వేసి దున్నుకోవాలి. మిగతా సగభాగం నత్రజని ఎరువును విత్తిన నెల రోజులకు కలుపు తీసి వేసుకోవాలి. భాస్వరం ఎరువును సింగిల్ సూపర్ ఫాస్పేట్ రూపంలో వాడినప్పుడు అదనంగా కాల్షియం, గంధకం లభించి దిగుబడులు వస్తాయి. విత్తిన వెంటనే మొదటి తడి ఇవ్వాలి. పూత, కాయ అభివృద్ధి, గింజకట్టు దశల్లో తడులు ఇవ్వాలి. విత్తిన తరువాత 35-40 రోజుల నుంచి 55-60 రోజుల వరకు నీటి ఎద్దడి లేకుండా చూడాలి.

కలుపు నివారణ, అంతరకృషి..

పెండిమిథాలిన్ 30 శాతం గానీ అలాక్లోర్ 50 శాతం గానీ విత్తిన వెంటనే పిచికారీ చేయాలి. మొక్కలు మొలిచిన 15 రోజులకు కలుపు తీసివేయాలి. విత్తిన 20-25 రోజులలో అంతరకృషి చేయాలి. విత్తిన 20-25 రోజులప్పుడు గడ్డిజాతి కలుపు మొక్కలు ఉంటే క్విజలోఫాప్ ఇథైల్ 5 శాతం, ఇ.సి 2 మిల్లీలీటర్లు నీటికి కలిపి పిచికారీ చేయాలి.